

ఎమ్మెల్యే మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు

# ప్రజల ఆశీస్సులతోనే ఘన విజయం

## ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, డిసెంబర్ 4: సనత్‌నగర్ శాసనసభ్యుడిగా మూడో సారి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు బస్తీలు, కాలనీలకు చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున చేరుకొని ఎమ్మెల్యే తలసానిని శాలువాలు, పూల మాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తాను ఘన విజయం సాధించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘ కాలిక సమస్యలను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గం ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.



తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు

## ఎమ్మెల్యే రాజాసింగ్‌ని అభినందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అబిడ్స్, డిసెంబర్ 4: గ్రేటర్ హైదరాబాద్‌లో బీజేపీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజాసింగ్‌ను కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అభినందించారు. సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధూల్‌పేట ఆరాంఘర్ కాలనీలోని ఎమ్మెల్యే రాజాసింగ్ నివాసానికి చేరుకోగా నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు బీజేపీ నాయకులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రమంతటా పర్యటించి బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా పాటుపడాలని కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సూచించారు. ఈ సందర్భంగా రాజాసింగ్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శశికళ కృష్ణ, డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ బీష్వ, బీజేపీ నాయకులు గోపాల్‌జీ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



ఖడ్గ మృగానికి శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

## ఖడ్గ మృగానికి శస్త్ర చికిత్స

చార్మినార్, డిసెంబర్ 4: జూ పార్కులో ఓ ఖడ్గ మృగం కంటి చూపు మెరుగుదలకు వైద్యులు క్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు క్యూరేటర్ డాక్టర్ సురేశ్ ఎస్ హిరేమత్ తెలిపారు. జూలో 11 సంవత్సరాల వయసున్న (విజయ్) ఖడ్గ మృగం 6 ఏండ్లుగా తీవ్రమైన కంటి నొప్పితో బాధపడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. భారీ ఆకారంతో ఉన్న ఖడ్గ మృగానికి శస్త్రచికిత్స చేయాలంటే ఉత్పన్నమయ్యే ప్రతికూల ప్రభావాలను ముందస్తుగానే గుర్తించిన వైద్యులు.. అందుకు తగిన జాగ్రత్తలను తీసుకున్నారు. సోమవారం వెటర్నరీ వైద్యులు అనస్థీషియా వైద్యుల సహకారంలో సుదీర్ఘ సమయం పాటు శ్రమించి.. ఖడ్గ మృగానికి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం వైద్యుల సంరక్షణలో మరో వారం రోజుల అనంతరం ఖడ్గ మృగం సంపూర్ణమైన కంటిచూపును పొందనున్నదని క్యూరేటర్ వెల్లడించారు. ఖడ్గ మృగానికి శస్త్రచికిత్స చేసిన వైద్యులు, ఇతర సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

## కేర్‌కు అవార్డు

బంజారాహిల్స్, డిసెంబర్ 4: తెలంగాణ రాష్ట్రంలో అత్యుత్తమ ఉద్యోగకల్పన సంస్థగా కేర్ హాస్పిటల్స్ గ్రూపునకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. వరల్డ్ హెచ్‌ఆర్‌డీ కాంగ్రెస్‌లో భాగంగా నగరంలో తెలంగాణ బెస్ట్ ఎంప్లాయర్ బ్రాండ్ అవార్డ్స్, లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డ్స్ -2023 ప్రదానోత్సవం నిర్వహించారు. నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో పాటు వేలాదిమంది ఉద్యోగులకు ఉపాధి కల్పన, సృజనాత్మక విధానాలతో హెల్త్‌కేర్ రంగంలో ఉన్నత శ్రేణిలో నిలిచిన కేర్ ఆస్పత్రి గ్రూప్‌నకు తెలంగాణ బెస్ట్ ఎంప్లాయర్ బ్రాండ్ అవార్డును అందించారు. సంస్థ తరపున సీఈవో జస్‌దీప్ సింగ్ అవార్డును అందుకున్నారు.



## ఏపీ ఎన్నికల ప్రీ పోల్ సర్వే చేస్తాం

ఖైరతాబాద్, డిసెంబర్ 4 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరుగబోయే ఎన్నికల ప్రీ పోల్ సర్వే చేసి కచ్చితమైన ఫలితాలు చెబుతామని చాణక్య స్ట్రాటజీస్ అండ్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు ముఖేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో గత ఎన్నికలు మొదలుకొని ప్రస్తుతం జరిగిన శాసన సభ ఎన్నికల వరకు కచ్చితమైన సర్వే నిర్వహించామన్నారు. ఈ ఎన్నికల్లో బూత్ స్థాయికి వెళ్లి 1.19 లక్షల శాంపిల్స్ సేకరించామన్నారు. రాష్ట్రంలో సెటిలర్స్ ఓట్లు కీలకంగా మారాయని, హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు మెజార్టీ రావడానికి వారి ఓట్లే కీలకమయ్యాయని తెలిపారు. త్వరలో జరిగే ఏపీ ఎన్నికల ప్రీ పోల్ సర్వే నిర్వహిస్తామని, ఇప్పటి వరకు తాము చేసిన సర్వేల్లో 98 శాతం విజయం సాధించామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ముఖేశ్

## రంగస్థల నటుడు శ్రీనివాసరావుకు పురస్కారం

ముషీరాబాద్, డిసెంబర్ 4: సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు జయంతిని పురస్కరించుకొని సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ మధురగీతాల విభావరి ప్రేక్షకులను అలరించింది. పలువురు గాయనీ, గాయకులు ఆలపించిన మధుర గీతాలు రంజింపజేశాయి. ఈ కార్యక్రమానికి సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు కొమరవోలు శ్రీనివాసరావుకు ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బు మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల నటుడు శ్రీనివాసరావును సత్కరించిన సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్

## తుఫాన్ వల్ల పలు విమానాలు రద్దు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 4 : తుఫాన్ కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు వెళ్లే 25 విమానాలను రద్దు చేసినట్లు జీఎంఆర్ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 5.35 నిమిషాల నుంచి రాత్రి వరకు పది విమానాలు రద్దు చేశారు. దీంతో పాటు తిరుపతి వెళ్లే నాలుగు విమానాలు, విజయవాడ ఒకటి, రాజమండ్రి మూడు విమానాలు, విశాఖపట్నం మూడు, అహ్మదాబాద్ ఒకటి, పుణె ఒకటి ఇలా మొత్తం 25 విమానాలు రద్దు చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో విమానాలను రద్దు చేశామని వివరించారు. ప్రయాణికులు ఇతర మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

# సిటీలో సీజనల్ వ్యాధులు

- జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులతో బాధపడుతున్న జనం
- నల్లకుంట ఫీవర్ దవాఖానకు.. ప్రతిరోజు 100కుపైగా ఓపీ కేసులు
- చిన్నపిల్లల్లో రోజుకు 50 న్యుమోనియా కేసులు
- సీజనల్స్‌తో జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా నగరంలో మళ్లీ సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. వాతావరణం ఉన్నట్లుండి చల్లబడటం, తేలికపాటి వానలు కురవడంతో జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలతో రోగులు దవాఖానలకు క్యూ కడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు శీతాకాలంలో వచ్చే సీజనల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా న్యుమోనియా వ్యాధికి గురయ్యే అవకాశాలుంటాయని హెచ్చరిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలతో నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు ప్రతిరోజు సుమారు 80నుంచి 100కు పైగా ఓపీ కేసులు వస్తున్నాయని, చిన్నపిల్లలకు సంబంధించి ప్రతి రోజు 50 న్యుమోనియా కేసులు వస్తుండగా అందులో ఒకటి లేదా రెండు కేసులను అడ్మిట్ చేసుకుంటున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని గ్రేటర్‌లోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ముందస్తు వైద్య సేవలను అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు తెలిపారు. బస్తీ దవాఖానలు, ఏరియా, జిల్లా దవాఖానల దగ్గర నుంచి ఉస్మానియా, గాంధీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ వరకు అన్ని ప్రభుత్వ దవాఖానల్లో అన్నిరకాల సీజనల్ వ్యాధులకు సంబంధించిన వైద్యం అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.